క్లుప్తంగా

అంజన్న సేవలో విప్ దంపతులు



ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న విప్ దంపతులు

రాయదుర్గం: జిల్లాలోని ప్రసిద్ధిచెందిన మురడి ఆంజనేయస్వామి సేవలో విప్ దంపతులు కాపు రామచంద్రారెడ్డి, కాపు భారతి, కుమారుడు కాపు ప్రవీణ్‌రెడ్డి తరించారు. శ్రావణ మాసం రెండో శనివారం సందర్భంగా వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షులు రాళ్ల తిమ్మారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎం.వన్నూర్ స్వామి, సర్పంచులు శ్రీనివాస్‌రెడ్డి, వాల్మీకి నాగరాజు, ఎంపీటీసీ కల్యం సురేష్, యాదవ సంఘం అధ్యక్షులు సురేష్‌యాదవ్, నాగయ్యతో కలసి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులతో కలసి క్యూలైన్‌లో వెళ్లిన విప్ పూజలు అనంతరం సౌకర్యాలపై ఆరా తీశారు. దూర ప్రాంతాల నుంచి స్వామి దర్శనం కోసం వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని ఈఓ నరసింహారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులకు విప్ ఆదేశాలు జారీ చేశారు. విప్ వెంట పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

ఆహార సలహా కమిటీ సమావేశం



మాట్లాడుతున్న తహసీల్దార్ ఈరమ్మ

విడపనకల్లు: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శనివారం ఆహార సలహా కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఆహార సలహా కమిటీ చైర్మన్, తహసీల్దార్ ఈరమ్మ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో ఎంపీపీ కరణం పుష్పావతి, జెడ్పీటీసీ హనుమంతు, స్టోర్ డీలర్ అసోసియేషన్ మండల చైర్మన్ తిమ్మారెడ్డి, సీఎస్‌డీటీ అనంతలక్ష్మి, ఐసీడీఎస్ అధికారిణి ఉమారాణి, ఎంఈఓ శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు కరణం భీమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

1 నుంచి 'ఆడుదాం ఆంధ్ర'



మాట్లాడుతున్న ఎంపీడీఓ సాలమాన్


కళ్యాణదుర్గం రూరల్: ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాలను సెప్టెంబర్ 1 నుంచి సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి రిజిస్ట్రేషన్ చేస్తారని ఎంపీడీఓ సాలమాన్ అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండలంలోని పంచాయితీ కార్యదర్శులకు సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ 15 సంవత్సరాల పైబడిన వారందరూ ఆడాదాం ఆంధ్ర క్రీడల్లో పాల్గొనవచ్చన్నారు అక్టోబర్ 2 నుంచి క్రీడలు ప్రారంభమవుతాయని, గ్రామ స్థాయి, నియోజకవర్గ స్థాయి, జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయిలో పోటీలు ఉంటాయన్నారు. రూ.10 వేల నుంచి రూ.3 లక్షల వరకూ నగదు బహుమతి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ విజయకుమారి, విస్తరణ అధికారి హరికృష్ణ, ఈఓఆర్‌డీ బాలాజీ, స్పోర్ట్స్ ఇన్‌చార్జ్ మద్దిలేటి , కిరణ్ చౌదరి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

'రెగ్యులర్ తహసీల్దార్‌ను నియమించండి'

కళ్యాణదుర్గం రూరల్: మండలానికి రెగ్యులర్ తహసీల్దార్‌ను నియమించాలని ఆర్డీఓ కార్యలయంలో శనివారం జేఏసీ నాయకులు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ మండలంలో పర్మనెంట్ తహసీల్దార్ లేక రైతులు, ప్రజలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉన్నతాధికారులు స్పందించి రెగ్యులర్ తహసీల్దార్‌ను నియమించాలన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు చెలమప్ప, అంకే తిప్పేస్వామి, దొణ తిమ్మప్ప, బొమ్మపల్లి మారన్న, ఉమేష్ తదితరులు పాలొన్నారు.

బిందు సేద్యం.. సర్కారు సాయం

- అన్నదాతలకు అండగా రాష్ట్ర ప్రభుత్వం
- బిందు సేద్యానికి 90 శాతం, తుంపర సేద్యానికి 55 శాతం రాయితీ
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతన్నలు





బిందు సేద్య పరికరాలను పరిశీలిస్తున్న ఏపీ ఎంఐపీ పీడీ ఫిరోజ్‌ఖాన్

రాయదుర్గం: అన్నదాతల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. విత్తు మొదలు విపత్తు దాకా ఆదుకునేందుకు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విశేష కృషి చేస్తున్నారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా ఏపీలో మాత్రమే రైతు భరోసా కేంద్రాలను అందుబాటులోకి తీసుకొచ్చి వెన్నంటే నిలిచారు. తద్వారా వ్యవసాయం పండుగలా మారింది. ఓ వైపు రైతు భరోసా, మరో వైపు పంటల బీమా, ఇంకోవైపు సున్నా వడ్డీ ఇలా అనేక పథకాలను అమల్లోకి తీసుకొచ్చి అన్నదాతల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచింది. అవసరమైన పనిముట్లతో పాటు యంత్రపరికరాలను సైతం అందించారు.

బిందు, తుంపర సేద్య పరికరాలకు పెద్దపీట

బిందు, తుంపర సేద్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం పోత్సహిస్తోంది. రైతుకు కావాల్సిన పరికరాలను రాయితీతో అందిస్తూ వ్యవసాయ రంగాన్ని విస్తరిస్తోంది. ఈ కారణంగా పంటలకు ఉపయోగించే నీటి వృథాను అరికట్టడంతో పాటు భవిష్యత్‌లో నీటి విపత్తు తలెత్తకుండా పటిష్ట చర్యలకు శ్రీకారం చుట్టారు.

2022-23, 2023-24 లో అందించిన డ్రిప్ పరికరాలు ఇలా ..

	2022-23			2023-24		
నియోజకవర్గం	రైతుల సంఖ్య	హెక్టార్లు	సబ్సిడీ రూ. లక్షల్లో	రైతుల సంఖ్య	హెక్టార్లు	సబ్సిడీ రూ.లక్షల్లో
రాయదుర్గం	1,447	1757.57	రూ.1760.80	575	699.44	రూ.721.83
కళ్యాణదుర్గం	1,934	2629.98	రూ.1986.75	223	306.80	రూ.212.43
ఉరవకొండ	1,394	1872.44	రూ.1314.84	641	834.20	రూ.679.09
మొత్తం	4,775	6259.99	రూ.5,062.39	1,439	1840.44	రూ.1613.35

బిందు సేద్యంతో చేపట్టే పంటలు నాణ్యమైన దిగుబడులతో పాటు పెట్టుబడి ఖర్చులు కూడా తగ్గుతున్నాయి. దీంతో అన్నదాతలు ఈ రంగం వైపు ఎక్కువగా మొగ్గుచూపుతున్నారు. రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో 2022–23లో 4,775 మంది రైతులు 6,259 వేల హెక్టార్లకు రూ.5.62 కోట్లు, 2023–24 ఏడాదిలో ప్రస్తుత నెల వరకూ 1,439 మంది రైతులు, 1,840 హెక్టార్లకు రూ.16.13 కోట్ల రాయితీ ద్వారా పరికరాలు అందించారు. ఐదు ఎకరాల్లోపున్న సన్న, చిన్న కారు రైతులకు బిందు సేద్యం పరికరాలు 90 శాతం, తుంపర సేద్యానికి 55 శాతం రాయితీతో అందించారు.

జిల్లాలో కళ్యాణదుర్గం, రాయదుర్గం ఉరవకొండకు అధికం..

బిందు, తుంపర సేద్యం పరికరాలు పొందడంలో జిల్లాలో శింగనమల తర్వాత కళ్యాణదుర్గం, ఉరవకొండ, రాయదుర్గం ప్రాంతాల రైతులే ఎక్కువ సద్వినియోగం చేసుకుంటున్నారు. ఈ ప్రాంతాల్లో పండ్ల తోటలు, కూరగాయలు, మొక్కజొన్న తదితర ఆరుతడి పంటలు ఎక్కువగా సాగులోకి రావడంతో బిందు, తుంపర సేద్య పరికరాలు వినియోగిస్తూ ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారు.

రూ.లక్షకు పైగా రాయితీ



బిందు సేద్యానికే అధిక ప్రాధాన్యత ఇస్తున్నాం. ఎక్కువగా బ్యాడిగి మిర్చి సాగుకు వినియోగిస్తున్నాం. రాయితీ పరికరాల కోసం ఇటీవల ప్రభుత్వానికి దరఖాస్తు చేశాం. రైతు వాటాగా రూ.11,826 చెల్లించా. రూ.1,15,259 విలువ చేసే పరికరాలను 90 శాతం రాయితీ ద్వారా అందించారు. రూ.1,06,433 మొత్తం రాయితీ ద్వారా కలిసొచ్చింది. చిన్న, సన్న కారు రైతుల సంక్షేమానికి సీఎం జగన్ విశేష కృషి చేస్తున్నారు.

– కె.సరస్వతి, మహిళా రైతు, గ్రామదట్ల

రైతు పక్షపాతి సీఎం జగన్



రైతు పక్షపాతిగా సీఎం జగన్ పాలన సాగుతోంది. బిందు, తుంపర సేద్యానికి పెద్దపీట వేస్తూ వ్యవసాయాన్ని పండుగలా మార్చారు. అర్హతే ప్రామాణికంగా దరఖాస్తుచేసిన రైతులందరికీ ఇళ్లవద్దకే రాయితీ పరికరాలు అందించేలా కృషి చేస్తున్నాం. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేతులు మీదుగా ఇటీవల పెద్ద ఎత్తున రాయితీ పరికరాలను అందించాం.

– కాపు రామచంద్రారెడ్డి, ప్రభుత్వం

30న కౌన్సిల్ సమావేశం

రాయదుర్గంటౌన్: రాయదుర్గం పురపాలకసంఘంలోని కౌన్సిల్ హాల్‌లో ఈనెల 30న ఉదయం 10.30 గంటలకు కౌన్సిల్ సాధారణ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప శనివారం తెలిపారు. సమావేశంలో పట్టణంలో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలతోపాటు ప్రజా సమస్యలపై చర్చిస్తామన్నారు. కౌన్సిల్ సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు, ఎక్స్ అఫీషియో సభ్యులు, విభాగాల వారిగా అధికారులు హాజరుకావాలని ఆమె కోరారు.

తక్షణ సాయం పంపిణీ



మృతుడి భార్యకు నగదు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది

కంబదూరు: మండల కేంద్రంలోని వడ్డే కాలనీకి చెందిన అప్పన్న(30)అనే యువకుడు అనారోగ్యంతో మృతి చెందాడు. శనివారం అతడి భార్యకు వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ.10 వేల నగదును సచివాలయ మండల కన్వీనర్ సాకే గంగాధర్, వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యుడు నీలి శంకరప్ప అందజేశారు. మిగిలిన సొమ్ము నామినీ బ్యాంకు ఖాతాలోకి జమవుతుందని వారు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మీసేవ కుమార్, వార్డు మెంబర్లు రాజు, అబ్బాస్, వైఎస్సార్ సీపీ నాయకులు చెన్న కేశవులు, నాగన్న, వడ్డే అంజప్ప, వడ్డే అనిల్, ప్రసాద్, ఒంటారెడ్డిపల్లి వెంకటేశులు, వెల్ఫేర్ అసిస్టెంట్ శాంతి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గరుడ వాహనోత్సవం



రాయదుర్గం రూరల్: గరుడవాహనంలో ఊరేగుతున్న లక్ష్మీనరసింహస్వామి



కళ్యాణదుర్గం రూరల్: అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

రాయదుర్గం రూరల్: శ్రావణ మాసం రెండో శనివారం సందర్భంగా మండలంలోని మల్లాపురం గ్రామ సమీపంలో విప్రమలై కొండల్లో వెలిసిన లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు రామ్మూర్తి స్వామీజీ ఆధ్వర్యంలో అర్చకుడు సుబ్రహ్మణ్య స్వామి సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం, పుష్పాలంకరణ గావించి నైవేద్యం సమర్పించి విశేష పూజలు చేపట్టారు. స్వామిని గరుడ వాహనంపై అధిష్టింపజేసి భాజాభజంత్రీలు, మేళతాళాలతో ఊరేగించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన భక్తులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని వడ్రహొన్నూరు సమీపంలో వెలిసిన అపులాపురం ఆంజనేయ స్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది.

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని కోట వీధిలో ఉన్న లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శ్రావణ మాసం రెండో శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేపట్టారు.

విద్యార్థులకు అభినందనలు



ఉద్యోగం సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

కళ్యాణదుర్గం రూరల్: అనంతపురం ఆర్ట్స్ కళాశాలలో శుక్రవారం నిర్వహించినన జాబ్ మేళాలో కళ్యాణదుర్గం డిగ్రీ కాలేజ్‌కు చెందిన 55మంది విద్యార్థులు వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించారని ప్రిన్సిపాల్ జయరామి రెడ్డి తెలిపారు.ఎన్నికైన విద్యార్థులకు శనివారం నియమక పత్రాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కో–ఆర్డినేటర్ డా, మహేంద్రరావు, జీకేసీ అనిల్ కుమార్, అధ్యాపకులు టి.శైలజారాణి, కవిత పాల్గొన్నారు.

జీబీసీ నుంచి తాగునీరు సరఫరా



మోటార్ సాయంతో తాగునీటి సరఫరాను ప్రారంభిస్తున్న ఎంపీపీ పుష్పావతి

విడపనకల్లు: విడపనకల్లు మండలంలోని ఎస్.తిమ్మాపురంలో తాగునీటి సమస్య పరిష్కారానికి జీబీసీ నుంచి విద్యుత్ మోటర్ సాయంతో నీటి పంపింగ్ చేశారు. నీటి సమస్య పరిష్కారమవుడంతో వైఎస్సార్ సీపీ నాయకులకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ కరణం పుష్పావతి, మాజీ సర్పంచ్ భీంరెడ్డి, సర్పంచ్ సుశీల, ఉపసర్పంచ్ పార్వతి, నాయకులు రాముడు, ఉమాశంకర్, సునీల్‌రెడ్డి, ధనుంజయ రెడ్డి, శివారెడ్డి, లచ్చప్ప, విరుపాక్షి తదితరులు పాల్గొన్నారు.

కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకోండి

గుంతకల్లుటౌన్: వచ్చే నెల 9వ తేదీ స్థానిక జేఎఫ్‌సీఎం కోర్టులో జరిగే జాతీయ లోక్‌అదాలత్‌లో కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి జి.మంజుల పోలీసు అధికారులకు సూచించారు. శనివారం సాయంత్రం కోర్టు హాల్‌లో లోక్‌అదాలత్ నిర్వహణపై జడ్జి మంజుల కోర్టు సిబ్బంది, లోక్ అదాలత్ కమిటీ సభ్యులు, పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. రాజీ మార్గమే రాజమార్గమని లబ్ధిదారులను చైతన్య పరచాలన్నారు. సమావేశంలో సీఐలు రామసుబ్బయ్య, మహేశ్వరరెడ్డి, ఎస్ఐలు గోపాలుడు, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

బసాపురం అంజన్నకు తేనె అభిషేకం



కూడేరు: అలంకరణలో బసాపురం ఆంజనేయ స్వామి



గుమ్మఘట్ట: గోనబావిలో పూజలందుకున్న ఆంజనేయస్వామి

కూడేరు: కూడేరుకు సమీపాన ప్రసిద్ధిగాంచిన బసాపురం ఆంజనేయ స్వామి ఆలయానికి శ్రావణ మాసం రెండవ శనివారాన్ని పురస్కరించుకొని భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. దీంతో ఆలయం భక్తులతో కిక్కిరిసింది. ఆలయ అర్చకుడు దుర్గ చైతన్య తొలుత ఆంజనేయ స్వామి మూల విరాట్‌కు తేనెతో అభిషేకం చేశారు. తర్వాత వివిధ రకాల పట్టు వస్త్రాలతో, పుష్పాలతో విశేషంగా అలంకరణ చేసి వడమాల ఆకు పూజ కట్టారు.భక్తులు ఆంజనేయదేవతామూర్తిని దర్శించుకుని తమ మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు అన్నదానం చేశారు.

గుమ్మఘట్ట: మండల వ్యాప్తంగా ఆంజనేయస్వామి ఆలయాలు భక్తులతో శనివారం కిటకిటలాడాయి. శ్రావణ శనివారం కావడంతో స్వామిని దర్శించేందుకు భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. స్వామి వారికి కుంకుమార్చన, ఆకుపూజ, పంచామృతాభిషేకం, మహామంగళారతి, పుష్పాలంకరణ తదితర పూజలు చేపట్టారు. అనంతరం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

చురుగ్గా ట్రాన్స్‌కో కార్యాలయ నిర్మాణం



కూడేరు: మండల కేంద్రంలోని విద్యుత్ ఉప కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరుకుంది. పైకప్పు నుంచి సిమెంట్ పెచ్చు లూడి కిందపడుతున్నాయి. అందులో సిబ్బంది విధులు నిర్వర్తించాలంటే ఇబ్బంది పడేవారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక నూతన భవన నిర్మాణానికి రూ.26 లక్షలు నిధులు మంజూరు చేసింది.. దీంతో నిర్మాణపు పనులు చురుగ్గా సాగుతున్నాయి. నూతన భవన నిర్మాణం పూర్తయితే సిబ్బందికి ఇబ్బందులు తొలగుతాయని ఏఈ గౌస్ తెలిపారు.

అసంపూర్తిగా మరుగుదొడ్లు..



హెచ్ఎం డబ్బులివ్వక పోవడంతో సెంట్రింగ్ పరికరాలను తొలగిస్తున్న దృశ్యం

కూడేరు: నిధులున్నా హెచ్ఎం అలసత్వంతో టాయిలెట్స్ లేక కూడేరు హైస్కూల్‌లోని విద్యార్థినులు అవస్థలు పడుతున్నారు. వివరాల్లోకి వెళితే... రాష్ట్ర ప్రభుత్వం నాడు–నేడు పథకం కింద 2022లో కూడేరు హైస్కూల్‌లో తరగతి గదులు, టాయిలెట్స్ నిర్మాణం, ఇతర మౌలిక వసతుల కోసం రూ.78 లక్షలు నిధులు మంజూరు చేసింది. టాయిలెట్స్ నిర్మాణం కోసం పనులు ప్రారంభించారు. కానీ నేటికీ పూర్తి కాలేదు. టాప్‌లెవల్‌కు నిర్మాణ పనులు నిలిచిపోయాయి. హెచ్ఎం డబ్బులు ఇవ్వకపోవడంతో గురువారం టాప్ నిర్మాణానికి ఏర్పాటు చేసిన సెంట్రింగ్ పరికరాలను తొలగించేశారు. మెటీరియల్‌కు రూ.18 లక్షలు, ఫర్నీచర్, విద్యుత్ పరికరాలు, ఇతర వాటికి(సీపీఎం) రూ.20 లక్షలు ఖర్చు పెట్టినట్లు అధికారిక ఆన్‌లైన్ రికార్డులు చెబుతున్నాయి. హైస్కూల్లో సుమారు 200 మందికి పైగా ఆడపిల్లలు విద్యనభ్యసిస్తున్నారు. టాయిలెట్స్ వసతి లేక తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయంపై హెచ్ఎం శ్రీదేవిని సాక్షి వివరణ కోరగా నెల క్రితం బదిలీపై వచ్చానన్నారు. ఇంతకుముందు ఇక్కడ పని చేసిన హెచ్ఎం శ్రీనివాసులు చేసిన పనులకు సంబంధించి రికార్డులను తనకు ఇవ్వలేదని, ఇంకా ఎంత మొత్తం నిల్వ ఉన్న విషయాన్ని అడిగినా చెప్పడం లేదన్నారు.. ఆయన రికార్డులు ఇస్తే టాయిలెట్స్ నిర్మాణపు పనులు పూర్తి చేయించి విద్యార్థినులకు ఇబ్బంది లేకుండా చూస్తానన్నారు.

వర్షం కోసం తోలు బొమ్మలాట ప్రదర్శన



చదం గ్రామంలో ప్రదర్శిస్తున్న తోలుబొమ్మలాట



వడ్రహొన్నూరులో గార్దబాలను ఊరేగిస్తున్న గ్రామస్తులు

రాయదుర్గం రూరల్: వర్షం కురవాలని కోరుతూ మండలంలోని చదం గ్రామంలో శుక్రవారం రాత్రి రామాయణ కథతో తోలు బొమ్మలాట ప్రదర్శించారు. అలాగే వడ్రహొన్నూరు గ్రామంలో శుక్రవారం రాత్రి ఎంపీటీసీ అరుణ్‌కుమార్, 74 ఉడేగోళం పీఏసీఎస్ చైర్మన్ భీమన్న ఆధ్వర్యంలో గార్దాబాలకు పెళ్లి చేసి, గ్రామంలో ఊరేగించారు. శనివారం అదే గ్రామంలో 101 ఇళ్లల్లో మట్టిపాత్రల్లో అన్నం వండి , ఆ అన్నాన్ని చిన్నారులు ప్రత్యేక పాత్రల్లో ఉంచుకుని అపులాపురం ఆంజనేయ స్వామి ఆలయం వరకు భక్తి గీతాల ఆలాపనతో భజన చేస్తూ ఊరేగింపుగా తీసుకెళ్లారు. అక్కడ స్వామి వారికి నైవేద్యం సమర్పించి, భక్తులకు అన్న సంతర్పణ చేశారు. పంటలు ఎండి పోకుండా కరుణించాలని గ్రామ పెద్దలతో కలిసి చిన్నారులు వరుణ దేవుడిని ప్రార్థించారు.

వ్యవసాయంపై అవగాహన పెంపొందించుకోవాలి



భూసార పరీక్షల గురించి తెలుసుకుంటున్న విద్యార్థులు

బుక్కరాయసముద్రం: విద్యార్థులకు చదవుతో పాటు వ్యవసాయంపై అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి పేర్కొన్నారు. శనివారం రెడ్డిపల్లి కేవీకేను అనంతపురానికిచెందిన 8,9,10వ తరగతి, ఇంటర్‌మీడియట్ విద్యార్థులు సందర్శించారు. ముందుగా కేవీకేలో చేపడుతున్న కార్యక్రమాలను ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి వివరించారు. కేవీకేలో మట్టి నమూనాల కేంద్రం, సీడ్ ప్రాసెసింగ్ సెంటర్, షేడ్ నెట్ అజోల్ల, సమాచార కేంద్రం, వర్మీకంపోస్ట్, పశువులు, గొర్రెల పెంపకం, వివిధ రకాల పంటల సాగుపై వివరించారు. రైతులకు పంటల సాగుపై నిత్యం సమాచారం అందిస్తూ శాస్త్రవేత్తలు పని చేస్తుంటారని తెలియజేశారు. కార్యక్రమంలో కేవీకే పశు పోషణ శాస్త్రవేత్త డాక్టర్ మాధవి, వ్యవసాయ విస్తరణ శాస్త్రవేత్త డాక్టర్ చందన, భూసార పరీక్ష కేంద్రం అధికారి ముత్యాల రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్

పెద్దవపూరు: నరసాపురం గ్రామ సమీపంలో పెన్నానది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను శనివారం తెల్లవారు జామున ఎస్ఐ ఖాజాహుస్సేన్ పట్టుకున్నారు. సుంకేసులపల్లికి చెందిన టీడీపీ కార్యకర్త నరేష్‌తోపాటు నరసాపురం గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్‌ను అరెస్టు చేశారు.

నాగ ప్రతిమలకు పూజలు

కూడేరు: శ్రావణ మాసం రెండవ శనివారాన్ని పురస్కరించుకుని మండల వ్యాప్తంగా మహిళలు నాగ ప్రతిమలకు ప్రత్యేక పూజలు చేపట్టారు. గ్రామాలకు దగ్గర్లో ఉన్న నాగుల పుట్టలు, కట్టల వద్ద ఉదయాన్నే నాగ ప్రతిమలకు, పుట్టలోకి పాలు పోసి మొక్కులు తీర్చుకున్నారు. బియ్యం పిండి, నూలు, బెల్లంతో చేసిన పదార్థాలను నైవేద్యంగా పెట్టారు.

సహకార సంఘ వార్షిక మహాసభ

కళ్యాణదుర్గం రూరల్: కళ్యాణదుర్గం మండల రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకర సంఘం ఏడీ వార్షిక మహసభ శనివారం ఆర్డీటీ ఎకాలజీ సెంటర్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా సీబీఓ కోఆర్డినేటర్ భాస్కర్ బాబు, ఏఎల్‌పీ కోఆర్డినేటర్ రిజ్వాన, ఎఫ్‌పీఓ కోఆర్డినేటర్ శంకర్‌నాయక్ హాజరయ్యారు. అలాగే 214 మంది వాటాదారులు హాజరయ్యారు. మండల సిబ్బంది భవాని, ఎఫ్‌పీఓ మేనేజర్ రమేష్ 2022–2023లో జరిగిన వ్యాపార లావాదేవీల గురించి అధ్యక్షులు వసంత, వాటాదారులకు చదివి వినిపించారు. ఈ సంవత్సరం వేరుశనగ విక్రయించి వాటాదారులకు లాభంలో 50 శాతం రైతులకు బోనస్‌గా ఇచ్చారు.

గృహాల మంజూరుకు కృషి చేయండి

గుమ్మఘట్ట: రాయదుర్గం నియోజకవర్గంలోని గుమ్మఘట్ట, రాయదుర్గం మండలాల్లో నూతన గృహాల మంజూరుకు కృషి చేయాలని కలెక్టర్ గౌతమి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మను జెడ్పీటీసీలు మహేష్, మల్లికార్జున కోరారు. జిల్లా కేంద్రంలోని జెడ్పీ కార్యాలయంలో ఈ మేరకు వినతి పత్రం సమర్పించారు. అలాగే గ్రామ సచివాలయాల్లో ఉద్యోగుల కొరత లేకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. గ్రామీణ ప్రాంతాలకు సీసీరోడ్లు, డ్రైనేజీలు, వాటర్ ప్లాంట్లు, మట్టిరోడ్లు మంజూరు చేయాలన్నారు.